క్లుప్తంగా

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ



బీవీ సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన దివంగత ఉపముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ బీవీ సుబ్బారెడ్డి రేనాటిగడ్డ ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారని రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. బీవీ 49వ వర్ధంతిని పురష్కరించుకుని బుధవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం పక్కన ఉన్న పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన బీవీ సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, వాల్మీకి సంఘం నాయకుడు సుబ్బయ్య, సభ్యులు అహమ్మద్ ఉసేన్, లక్ష్మణ్, నరసింహులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రాధిక

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారిణిగా ఈఓపీఆర్‌డీ రాధికకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న మహబూబ్‌దౌలా చాగలమర్రి మండలానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో రెగ్యులర్ ఎంపీడీఓను నియమించకపోవడంతో ఇక్కడే ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న రాధికకు అదనపు బాధ్యతలు ఇస్తూ బుధవారం జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

9న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

బేతంచెర్ల: నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ 9వ వార్షిక ఉత్సవాలు ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి బచ్చు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం నుంచి స్వామవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ఉంటుందని, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న వలంటీర్ల అభినందనీయులని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉత్తమ వలంటీర్లుగా ఎంపికై న వారిని శాలువా, ప్రసంశా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జానకిరాముడు, పంచాయితీ కార్యదర్శులు రవిచంద్ర, ఉదయ్‌కిరణ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగించి డ్రైన్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలి నుంచి బేతంచర్ల రహదారిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆక్రమణల వల్ల డ్రైన్స్ ఏర్పాటుకు ఇబ్బందిగా ఉన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. డ్రైన్స్ ఏర్పాటుకు రూ.5లక్షల మండల నిధులు మంజూరు చేశామన్నారు. గతంలో ఆక్రమణల వల్ల రహదారులు ఇరుకుగా ఉండడమే కాకుండా డ్రైన్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా ఉండేదని ఎంపీడీఓ తెలిపారు. ఆక్రమణల తొలగింపునకు ప్రజలు స్వచ్ఛందగా సహకరిస్తున్నట్లు తెలిపారు.

స్టింగ్ ఎనర్జీ కూల్‌డ్రింక్‌ను నిషేధించాలి

ప్యాపిలి: ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న స్టింగ్ ఎనర్జీ కూల్‌డ్రింక్‌ను నిషేధించాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివకిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ కూల్‌డ్రింక్ షాపుల్లో స్టింగ్ ఎనర్జీ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తెలిపారు. స్టింగ్ ఎనర్జీ కూల్‌డ్రింక్‌లో కెఫిన్ అనే మత్తు పదార్థాన్ని వాడుతున్నారని వారు వాపోయారు. మహిళలు, చిన్నారులు ఈ డ్రింక్‌ను తాగి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు శీతల పానీయాల దుకాణాలను తనిఖీ చేసి వెంటనే స్టింగ్ కూల్ డ్రింకులను అమ్మకుండా ఆదేశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజేశ్, లక్ష్మినారాయణ, వంశీ, పవన్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు కళకళ!

- రూ. 2.35 కోట్లతో కార్యాయాల భవనాలు
- ఆధునిక వసతులతో నిర్మాణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న అధికారులు, ప్రజలు



రూ.1.20 కోట్లతో నిర్మించిన నూతన ఎంపీడీఓ కార్యాలయం



రూ.18 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం



రూ.75 లక్షలతో నిర్మించిన పశువైద్యశాల



రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

సంజామల: మండల కేంద్రం సంజామలలో ప్రభుత్వ భవనాలు కళకళలాడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కోసమస్య పరిష్కారం అవుతుంది. ఏళ్లతరబడి అరకొర వసతులతో అద్దెభవనాల్లో అధికారులు, ప్రజలు పడిన ఇబ్బందులు తొలగనున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో సొంత భవనాలు రూపుదిద్దుకున్నాయి. రూ. 2.35 కోట్లతో ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రత్యేకించి అద్దెభవనంలో సాగిన ఎంపీడీఓ కార్యలయంలో అధికారులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇక వర్షాకాలం వారి ఇబ్బందులు వర్ణనాతీతం. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరువ తీసుకుని నూతన భవనానికి రూ.1.20 కోట్ల మంజూరు చేయించారు. ఈ మేరకు అన్నిహంగులతో కొత్తభవన నిర్మాణం పూర్తయింది. అదేవిధంగా రూ.75 లక్షలతో ఏరియా పశువైద్యశాల, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. భవనాల సమస్య తీరడంతో అధికారులు, మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఎంపీడీఓ కార్యాలయం, ఏరియా పశువైద్యశాల భవనాలు ప్రారంభించేందుకు అధికారయంత్రం సిద్ధం అవుతుంది. ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యే కాటసాని, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త భవనాల ప్రారంభోత్సవం ఉంటుందని జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అద్దెభవనాల ఇబ్బందులు తొలిగాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అద్దెభవనాల ఇబ్బందులు తొలగనున్నాయి. కనీస వసతుల లేక ఎంపీడీ కార్యాలయ అద్దెభవనంలో ఏళ్లతరబడి ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. సమస్యను ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. రూ. 1.20 కోట్లతో ఎంపీడీఓ నూతన భవనాన్ని నిర్మించాం. చాలా సంతోషంగా ఉంది.

– ఎంపీపీ పోచా రమాదేవి

కార్యాలయంలోకి వర్షం నీరు వచ్చేది....



అద్దె భవనం కారాలయంలో విధులు నిర్వర్తించేందుకు చాలా ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో నీరు కార్యాలయంలోకి వచ్చి రికార్డులు తడిడిపోయేవి. రికార్డులను కాపాడుకునేందుకు నానా తంటాలు పడేవారం. రూ 1.20 కోట్ల నిధులతో కొత్త భవనం నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపతున్నాం.

–ఎంపీడీఓ నాగ కుమార్

అభివృద్ధి బాగా జరుగుతుంది...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో అభివృద్ధి పనులు బాగా జరుగుతున్నాయి. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించడం సంతోషకరం. ఎంపీడీఓ అద్దెభవనంలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– సూదుల కుపేంద్రా రెడ్డి, రైతు, సంజామల.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్ టౌన్: ఉడుములపాడు గ్రామ సమీపంలోని చెరువు వద్ద రెండురోజుల క్రితం మృతి చెందిన అనాథ మృత దేహానికి గురువారం ద్రోణాచలం సేవా సమితి సభ్యులు హిందూ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ ఎస్ఐ నగేష్ గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి ద్రోణాచలవ సేవా సమితి సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆత్మబంధువులు 78వ అంత్యక్రియలు నిర్వహించారు.ఈ అంత్యక్రియలకు ప్రైవేట్ ఉపాధ్యాయుడు చందు బాబు,రాజయ్యగౌడ్ తదితరులు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సైనికులు షాదిఖానా రాజు, గురుస్వామి, పానిపూరి మురళి, హోమేశ్వరరెడ్డి, కానిస్టేబుల్ రవికుమార్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన విద్యాకానుక



పాఠశాలలకు జేవికే కిట్లను తరలిస్తున్న దృశ్యం

అవుకు: మండల కేంద్రంలోని జేవికే స్టాక్ పాయింట్ అయిన జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం తరలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండల పరిధిలోని 49 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 4525 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. పాఠశాలు పునః ప్రారంభం రోజే జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నామన్నారు.

గృహ నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయండి

- హౌసింగ్ జిల్లా పీడీ విజయ్ భాస్కర్ నాయుడు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న విజయ్ భాస్కర్ నాయుడు

డోన్ : జగనన్న కాలనీల్లో మంజూరైన గృహాలను లబ్ధిదారులు సత్వరమే పూర్తిచేయాలని నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీ విజయభాస్కర్‌నాయుడు సూచించారు. బుధవారం పట్టణ శివారులోని దొరపల్లె, ఉడుములపాడు లేఅవుట్లలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక గృహాలు డోన్ నియోజకవర్గానికి మంజూరు అయ్యాయన్నారు. ఒక్క డోన్ పట్టణంలోనే 3,900 పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. అదేవిధంగా స్టీల్, సిమెంట్, ఇసుక సకాలంలో అందజేస్తున్నందున ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

గోడౌన్‌లను తనిఖీ :

స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న హౌసింగ్ శాఖ గోడౌన్‌ను తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులుతో కలిసి పీడీ విజయభాస్కర్‌నాయుడు తనిఖీ చేశారు. సిమెంట్, ఇసుక, ఐరన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ కృష్టారెడ్డి, ఏఈలు నాగభూషణం, వీరేంద్రలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: జగనన్న కాలనీల్లో మంజూరైన గృహాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ విజయభాస్కర్ నాయుడు, ఈఈ కృష్టారెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను పరిశీలించి పురోగతిపై చర్చించారు. అలాగే సిమెంట్ గోడన్‌లో ఉన్న స్టాక్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, హౌసింగ్ ఏఈ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా మొక్కలు విక్రయిస్తే చర్యలు



నర్సరీ నిర్వాహకుడికి లైసెన్సు అందజేస్తున్న అధికారులు

ప్యాపిలి: నర్సరీ నిర్వాహకులు లైసెన్సు లేకుండా మొక్కలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వంగాల భరత్ కుమార్ హెచ్చరించారు. స్థానిక ప్యాపిలి–1 రైతుభరోసా కేంద్రంలో బుధవారం నర్సరీ నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నర్సరీ యాక్ట్‌ను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. నర్సరీల్లో రైతులు కొనుగోలు చేసే మొక్కలకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నిర్వాహకులు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన మొక్కలనే విక్రయించాలన్నారు. నర్సరీ యాక్ట్ ప్రకారం నిర్వాహకులు ట్రెజరీ ద్వారా రూ. 1000 చలానా చెల్లించి లైసెన్సు పొందాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలి రూ. లక్ష ఆస్తి నష్టం



కాలిపోయిన పూరిగుడిసె

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. గ్రామానికి చెందిన షేక్ పెద్ద మాబు పూరి గుడిసెలో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండగా గ్యాస్ వాసన రావడంతో గ్యాస్ లీకైనట్లు గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే సిలండర్ వద్ద మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. కొద్దిసేపటి తర్వాత సిలిండర్ పెద్ద శబ్ధంతో పేలింది. దీంతో ఒక్క సారిగా పూరి గుడిసెకు నిప్పంటకోవడంతో స్థానికులు ఆర్పేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పెద్ద మాబు తన కుమార్తె వివాహం నిమిత్తం కొద్ది రోజుల క్రితమే రూ. లక్ష విలువైన సామాగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేశాడు. ఈ సామాగ్రి మొత్తం మంటల్లో కాలిపోవడంతో లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత



డోన్ : మండలంలోని యు కొత్తపల్లె గ్రామంలో ఇటీవల మరణించిన చిక్కెం చంద్రప్ప కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ ఎర్రగుంట్ల విద్య బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు మహేశ్వరరెడ్డి, షేక్ మిన్నెల్ల, నభిరసూల్, కురువ హనుమన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్ర, వలంటీర్ మధు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

డోన్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధస్తుందని పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య అన్నారు. పట్టణంలోని శ్రీసుధ హైస్కూల్ నందు గీతా యోగాసన సంఘం 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య, సంఘం అధ్యక్షులు తిమ్మయ్య, కార్యదర్శి శేషఫణిశెట్టి, సభ్యులు నాగభూషణంరెడ్డి, మాకం బాలు, సాయిబాబా, రఘు, శ్రీసుధ సంస్థ డైరెక్టర్లు సుదర్శన్, వేణుగోపాల్, రాజా సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సాయం మరువం

అవుకు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కాంట్రాక్ట్ ఉద్యోగులమంతా రుణపడి ఉంటామని, ఆయన సాయం మరువమని స్థానిక జూనియర్ కాలేజీ కాంట్రాక్ట్ ఉద్యోగులు సుభాకర్, బయ్యారెడ్డి, బాలమ్మ, పద్మావతి తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను సీఎం రెగ్యులరైజేషన్ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దాదాపు 22 సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని చెప్పి మోసం చేశాయన్నారు. ఏ సీఎం చేయలేని పనిని వైఎస్ జగన్ చేసి చరిత్రకెక్కారని సంతోషం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

తల్లిపై కొడుకు దాడి

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామంలో బుధవారం తల్లిపై కొడుకు దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు మద్దిరాల రాములమ్మకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు మద్దిరాల మధు, కోడలు లక్ష్మి తనపై దాడి చేసి ఇంటి నుంచి గెంటేశారని రాములమ్మ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెద్దకుమారుడు, కోడలిపై కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అవుకు(కొలిమిగుండ్ల): కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్న ఏడు మందిపై బుధవారం కేసు నమోదు చేసామని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.7050 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

డోన్ టౌన్ : పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సారా విక్రేత, మట్కాబీటర్ ఈడిగ మనోహర్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగేష్ బుధవారం తెలిపారు. అతని నుంచి 15లీటర్ల నాటుసారా, మట్కా చీటీలతో పాటు రూ.500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

గృహ హింస కేసు నమోదు

డోన్ టౌన్: పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు గృహహింస కేసు నమోదైంది. ఏఎస్ఐ భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాతపేటకు చెందిన గాదిలింగ స్వామి, లక్ష్మిదేవి దంపతుల కుమార్తె హనీసాను అనంతపురం జిల్లా కూడేరు గ్రామానికి చెందిన ఎర్రిస్వామి కుమారుడు శివప్రసాద్‌తో వివాహం జరిపించారు. కట్నం కింద రూ.1.50లక్షలు, 10 తులాల బంగారం ఇచ్చారు. వీరికి కుమారుడు ఉన్నాడు. అయితే రెండేళ్ల కిందట అనంతపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హనీసాను భర్త వదిలించుకోవాలనే ఉద్దేశంతో వేధింపులకు పాల్పడుతున్నాడు. హనీసా ఫిర్యాదు మేరకు భర్తతోపాటు మామ, అత్త, ఆడపడుచుపై గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వలంటీర్లకు సన్మానం

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన వలంటీర్లను సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. సేవాభావంతో వలంటీర్లు చేస్తున్న ఈ కార్యక్రమాలు ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు దేవముని, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతోపాటు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు ఆశాజనకంగా మారటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన వసతిగృహాన్ని పరిశీలించిన చైర్మన్


డోన్ : స్థానిక కోర్టు రోడ్డులోని ఆర్అండ్‌బీ కార్యాలయం ఆవరణలో రూ.3కోట్లతో నిర్మించిన వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కమిషనర్ వెంకటరామిరెడ్డిలు బుధవారం పరిశీలించారు. ఈనెల 9న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఆవరణలో కల్పించాల్సిన వసతుల గురించి ఈ సందర్భంగా ఆర్అండ్‌డీ డీఈ రామకృష్ణారెడ్డి, జేఈ శ్రీకాంత్‌రెడ్డిలతో వారు చర్చించారు. కార్యక్రమంలో ఏఈ జనార్దన్, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

సంజామల: వాటర్ షెడ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాటర్ షెడ్ అధికారి టీఓ అండ్ సీబీ బ్రహ్మానంద రెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో బుధవారం వాటర్ షెడ్ పథకంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్ కింద ఇంజిన్లు, స్ప్రేర్స్, పట్టలు, పైపులు తదితర వ్యవసాయ పనిముట్లు పొందచ్చన్నారు. బనవాసి కేవీకే సైంటిస్ట్ డాక్టర్ కె లక్ష్మణ్ డాక్టర్ టి శ్రీచందన వాటర్ షెడ్ అధికారులు (డబ్ల్యూడీసీ) పీవో విజయత, జేయి రమణ, సైంటిస్ట్ లక్ష్మణ్ పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఆకుమల్ల, కమలపూరి బొందల దిన్నే వాటర్ చైర్మన్లు గౌరిగారి వెంకటేశ్వర రెడ్డి, తులసి రెడ్డి శ్రీరాం రెడ్డి, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు మద్దిలేటయ్య క్షేత్రంలో పునర్నిర్మాణ ఆలయ ప్రతిష్ఠ

- ఉత్సవాలకు హాజరు కానున్న మంత్రి బుగ్గన



శ్రీ మద్దిలేటి నరసింహస్వామి నూతన ఆలయం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో రూ.3.90 కోట్లతో పూర్తైన స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం జరుగనున్నాయి. ఉత్సవాలకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరవుతారని ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు బుధవారం తెలిపారు. ఆలయ శిలాఫలకాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి ప్రారంభించి, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

ట్రిపుల్ ఆర్‌కు ప్రజా మద్దతు



వస్తువులను సేకరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయం సిబ్బంది

డోన్ టౌన్: కాలుష్య రహిత సమాజం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల పెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మున్సిపాల్టీలలో వ్యర్థాలను సేకరించేందుకు ట్రిపుల్ ఆర్ పథకం ప్రభుత్వం తీసుకొచ్చింది. రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ ప్రోగ్రామ్ కింద వీధుల్లోకి వెళ్తున్న సచివాలయం సిబ్బందికి ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది. పర్యావరణానికి ముప్పు కలిగించే వస్తువుల వాడకాన్ని తగ్గించడం (ప్లాస్టిక్ కవర్లు రెడ్యూస్), మరికొన్ని వస్తువులను తిరిగి ఉపయోగించుకోవడం(రీ సైక్లింగ్), వస్తువులు వినియోగించిన తరువాత వాటిని చెత్తలో పడివేయకుండ అవసరం ఉన్న ఇతరులకు గుర్తించి అందించడం (పాతవి రీయూజ్) (టీవీ, కుర్చీలు, సోఫా, పాతబట్టలు, గిన్నెలు)కోసం రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీల్లో ట్రిపుల్ ఆర్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా డోన్ పట్టణంలో సచివాలయం సిబ్బంది మే 17 నుంచి వీధుల్లో తిరుగతూ ట్రిపుల్ ఆర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి వస్తువులను సేకరిస్తున్నారు. ప్రజలు సైతం సచివాలయ సిబ్బందికి సహకారం అందజేస్తున్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయాలి

డోన్ టౌన్: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రంగనాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా బుధవారం మండల పరిధిలోని ధర్మారం గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు రక్షణ కరువైందన్నారు. క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పవన్, నాయకులు రాజశేఖర్, రంగమ్మ, భాగ్యమ్మ, సువర్ణ, అనంతమ్మ, లక్ష్మీదేవి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా మొక్కజొన్న సాగు



వ్యవసాయ బోర్ల కింద సాగు చేసిన మొక్కజొన్న

బనగానపల్లె: మొక్కజొన్నను బనగానపల్లె నియోజకవర్గంలో రైతులు విస్తారంగా సాగు చేశారు. నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 10200 హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఎక్కడలేనంతగా సుమారు 21వేల వ్యవసాయ బోర్లు ఉండగా వీటి ఆధారంగా సుమారు 75–80 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యంలభిస్తుంది. మొక్కజొన్న పంటసాగుకు నల్లరేగడి నేలలు అనుకూలం. నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో నల్లరేగడి నేలలు ఉన్నందున అధిక విస్తీర్ణంలో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. గత 15 రోజులుగా సుమారు 2,600 హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల చివరి వరకు ఈ పంటను సాగుకు అవకాశం ఉందని, సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారుల మాట. గత ఖరీఫ్, రబీ సీజన్ మొక్కజొన్న పంటను రైతులు సాగు చేయగా మంచి దిగుబడి లభించింది. అదేవిధంగా గిట్టుబాటు ధర లభించడంతో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు.

12లోపు నాడు-నేడు పనులు పూర్తి చేయండి

నంద్యాల: మన బడి నాడు– నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులు ఈ నెల 12వ తేదీలోపు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, ఎంఈఓలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనుల ప్రగతిపై మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మండలంలో అత్యంత తక్కువగా ప్రగతి చూపిన పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ఈనెల 11వ తేదీ సాయంత్రంలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు సరఫరా కావాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లల సర్వే 89 శాతం పూర్తయిందని గురువారం సాయంత్రంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.